# యువరచయితలకు కథగురించి...!

కాళీపట్నం రామారావు



కథల మాస్టారు కాళీపట్నం రామారావు మాస్టారు చివరగా రాసిన కథ క్షుద్ర - 1972లో. మళ్ళీ యింత కాలానికి కలం పట్టారు. తెలుగు కథా సాహిత్యంతో తమకున్న 44 ఏళ్ళ అనుబంధాన్ని, అనుభవాన్ని రంగరించి 'కథల గురించి' నాలుగు విశ్లేషణాత్మక వ్యాసాలు రాస్తున్నారు. ఈ వ్యాసాలు యువరచయితలకేనని మాస్టారు అంటారు, కాని, అవి అందరు రచయితలకీ, పాఠకులకీ, సాహిత్యకారులకీ, ఉపయుక్తం కాగలవని మేము అనుకుంటూన్నాం. పూర్తయిన మొదటి వ్యాసాన్ని మొదటిసారిగా ప్రచురించ గలుగు తున్నందుకు జ్యోతి మహాద్భాగ్యంగాభావించి, గర్విస్తోంది.

కథను గూర్చిన జిజ్ఞాస నాకు యీ నాటిది కాదు, దానిని గూర్చి ఒక అభిప్రాయానికి రావడానికి నాకు చాలా ఏళ్ళు పట్టింద్ది.

కథమీద తెలుగులో దొరికేవి రెండే రెండు వ్యాస సంకలనాలు, చెదురు మదురుగా మరి కొన్ని వ్యాసాలు. ఇవి సాంతం చదివినా వీటినుండి నాకు కావలసిన భోగట్టా అంతా నేను తెలుసుకోలేక పోయాను. అవి ఆధారంగా, అవి కాక తెలిసిన వారివల్ల అప్పుడప్పుడూ తెలుసుకుంటూ వచ్చిన అభిప్రాయాలతో పాటు సుప్రసిద్ధమైన కథలను పదేపదే మననం చేసుకోవడం వల్ల కథను గూర్చిన నా సందేహాలు కొంతలో కొంత తీరుతున్నట్టనిపించింది-తదుపరి నాకు కొంత తెలిసినట్టనిపించింది.

కథంటే ఏమిటన్న ప్రశ్నపై ఇది యీనాటి నా అవగాహన.

నా అవగాహనలో గుణ దోష లోపాలను ఇతర పెద్దల సహాయంతో విశ్లేషించుకుని సరియైన అవగాహనకు రావలసిన పూచీ పాఠకులదేనని సవినయంగా మనవి.

ఇది నా అవగాహనే కాని నా సిద్ధాంతంకాదని యువ రచయితలు గుర్తుంచుకోవాలి.

* * *

ముప్ఫై మూడేళ్ళనాటి పాత ఆంధ్ర పత్రిక తెరిస్తే ఓ పేజీలో ఎడంవైపు పై భాగాన చిన్న అక్షరాల్లో 'కథ' అనీ, దాని క్రిందుగా పెద్ద అక్షరాల్లో రచన పేరూ, ఆ క్రింద రచయిత పేరూ కనిపించాయి అనుకుందాం.

మాట వరసకి రచనపేరు 'జరీఅంచు తెల్లచీర' - రచయిత పేరు రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారు.

ఆ పేర్ల క్రింద మూడు నాలుగు పేజీలలో కొన్ని పేరాలుగా విడిపోయి చాలా చాలా విరామ చిహ్నాలమధ్య వేలకొద్దీ అచ్చక్షరాల సమూహం కనిపిస్తుంది.

ఆదేనా రావిశాస్త్రిగారి జరీఅంచు తెల్లచీర కథ !

స్థూలంగా వ్యవహరించేటప్పుడు దానిని అలానే వ్యవహరిస్తారు. నిజానికి ఆ స్థూలరూపం వెనక ఉండే ఇంకేదో దాన్ని అలా అనాలికదా ?

ఎందుకనంటే - గురజాడ అన్న నాలుగు అక్షరాలు గురజాడ అప్పారావు పంతులుగారు కాదు,

కన్యాశుల్కం రాసిన, తెలుగు కథకు శ్రీకారం చుట్టిన, ముత్యాల సరాలు అందించిన మహాకవిని మన కళ్ళముందుంచడానికి ప్రయోక్త వాడిన సంకేతాలు - ఆ నాలుగు అక్షరాలూ.

అదేవిధంగా పై చెప్పిన అక్షర సముదాయం లేదా పదవాక్య సముదాయం మన మనోలోకంలో, కొన్ని బొమ్మల్నీ, ఆ బొమ్మల్లో కొన్ని బొమ్మలు పలికే పలుకుల్నీ, కొన్నింటినుంచి వచ్చే శబ్దాలనూ, కనిపించి వినిపించడానికి ఏర్పడిన సంకేత సమూహం. అంతేకాని ఆ సంకేత సమూహమే కథకాదు.

తద్వారా కనిపించే బొమ్మల్లో కొన్ని ఆ రచనలో పాత్రలు. మరికొన్ని ఆ పాత్రలమధ్య జరిగే సంఘటనలు, లేదా

ఏర్పడ్డ సన్నివేశాలు. ఇంకొన్ని ఆ సంఘటనలూ సన్నివేశాల చుట్టూ ఆ పాత్రల చుట్టూ ఉండే వాతావరణానికి భూమికకూ పాత్రల ఛహరాలకూ, చర్యలకూ సంబంధించినవి.

వినిపించే శబ్దాలలో కొన్ని స్థలాన్నీ, కాలాన్నీ, మరికొన్ని వాతావరణాన్నీ, పాత్రల కదలికల్నీ ప్రస్ఫుటం చేస్తాయి.

పాత్రలు పలికిన పలుకులు కూడా కొన్ని, వాటి మనోగత భావాలను మాత్రమే ధ్వనిసాయి. మరికొన్ని ఆ భావాలతోపాటు అప్పటి ఆ పాత్రల మనస్థితిని లేదా ఆవేశాలనూ తెలియజేస్తాయి. కొన్నైతే వాటి స్వభావాన్నీ వాటిసంస్కారాన్నీ తెలియజేస్తాయి. ఇంకాకొన్ని పలుకులు పాత్రలకూ, సంఘటనలకూ సంబంధించిన వర్తమానంతోపాటు వాటి గతాన్నీ, భవిష్యత్తునూ అర్థం చేసుకోడానికి సాయపడతాయి.

వీటన్నిండినీ - ఎలా అర్థం చేసుకోవలసినవాటిని అలా అర్థం చేసుకుంటూ, అర్థం చేసుకున్న వాటిని వేటిస్థానంలో వాటిని అమర్చుకుంటూ, వ్యక్తమైన సమస్తాన్నీ క్రమ పరచుకోవడంవల్ల పాఠకుడికొక వృత్తాంతం తెలుస్తుంది.

ఆ వృత్తాంతాన్నే చాలామంది కథగా భావిస్తారు.

అయితే ఆ వృత్తాంతమేకథా?

అవునూ కాదూ అనుకునేముందు అలాంటి సందేహం ఎందుకు రావాలో చూద్దాం.

పట్టపగలు నగర మధ్యంలో ఓ రోడ్ ప్రమాదం జరిగింది. ఆ జరిగిందాన్ని మొదటినుండి తుదిదాకా చూసినవాళ్లు పదిమంది ఉన్నారనుకుందాం.

దానికి సంబంధించిన మనో దృశ్యాలూ, వారి అవగాహనా అందుమీద వారి అభిప్రాయాలూ - యీ పదిమందివీ సరిపోలిస్తే ఫోటో కాపీలలా ఒక్కలాగే ఉంటాయా?

ఎందుకుండవూ?

ఇంద్రియ గ్రహణ శక్తుల్లో తరతమ భేదాల వల్లా పత్కాల మనస్థితుల్లో వారి వారి మధ్య ఉండే భేదాల వల్లా ఇంకా ఇతర కారణాలవల్లా ఒకరికి కనిపించినంతా యింకొకరికి కనిపించదు. లేదా వినిపించినంతే ఇంకొకరికి వినపించదు.

చూసిన దానినీ. విన్న దానినీ సమాహారంగా అనుభవించుకోడంలోనూ అర్థం చేసుకోడంలోనూ భేదాలుంటాయి.

వారివారి స్వభావాలూ, లోకానుభవం, సంస్కారానికి సంబంధించిన విలువలూ, వాటివల్ల ఏర్పడే పాక్షికతలూ కారణంగా కూడా ఏకాభిప్రాయత ఏర్పడదు.

ఆటోవాడు కుడిపక్కగా తప్పుకోవడం వల్ల ఎదరగా వస్తున్న బస్సు డ్రైవరు వాడి కుడివైపుకి కొయ్యవలసి వచ్చిందని ఒకరనవచ్చు. అదికాదు ముందు బస్సుడ్రైవరు ఎటుగా వస్తున్నాడో తెలీకుండా రోడ్డుకి సెంటర్ చేసి స్పీడుగా వచ్చేస్తుంటే ఆటో వాడిస్థానంలో ఎవరున్నా తడబడతారని ఇంకొకరనవచ్చు.

గుద్దుకున్న బళ్ళవేగాల గురించీ, రోడ్మీద స్థిరచరస్థితిలో ఉన్న ఇతర వాహనాల ప్రభావం గురించీ ఎవరెవరి ధోరణుల్లో వారు ఎంతకీ ఏకాభిప్రాయానికి రాలేరు.

ఈవిధంగా పదిమంది కళ్ళెదుట జరిగిన ఒక సంఘటన గురించి ఆయా కారణాల వల్ల పదిమందీ పలు విధాలుగా అభిప్రాయ పడ్డట్టే అచ్చులో ఉన్న జరిగింపెల్ల చీరను చదివిన వారందరూ దానిని ఒకే విధంగా గ్రహించరు, వారి వారి పునర్నిర్మాణశక్తిని బట్టి, వారి అవగాహన బట్టి వారి వారికి తెలియ వచ్చిన వృత్తాంతాలు, వాటిమధ్య భేదాలు ఎంత ఎక్కువ ఉండే అంతగానూ విభేదించవచ్చు.

కథం బాగోగుల గురించీ, వాటివల్ల వ్యక్తమయ్యే అంశాలమీదా మిత్రుల గోష్ఠుల్లోనూ అభిప్రాయవేదికలూ చర్చా వ్యాసాల్లోనూ వాదోపవాదాలు చూడండి. అందరి ముఖాల్లోనూ లేదా గొంతుల్లోనూ వారివారి చిత్తశుద్ధి వ్యక్తమయ్యేచోట కూడా వారి మధ్య తీవ్రమైన భేదాభిప్రాయం చూస్తాం.

అయినప్పుడు అలా పాఠకులు చేసుకున్న పునర్నిర్మాణాలవల్ల వారి వారికి తెలియ వచ్చిన వృత్తాంతాలుగాని, ఆ పునర్నిర్మాణాలేకాని-వాటిల్లో ఏ ఒక్కటైనా అసలుకథ కాగలదా?

కానప్పుడు మరేది?

ముందుకుపోయి రచన అక్షరరూపం ధరించకముందు ఆకృతి చెందిన క్రమాన్ని పరిశీలిద్దాము.

చాలామంది పాఠకులు - లోగడే చెప్పినట్టు-కొందరు కొత్త రచయితలూ ఏమనుకుంటారంటే రచయితలందరూ ఎప్పుడో ఎక్కడో జరిగిన దానినే కాస్త అలా ఇలా మార్చి సుంచి కథకు కావలసిన రూపులు దిద్ది కథగా రాస్తారనుకుంటారు.

ఈ ఊహ నిరాధారమైనది కాదు. అలా అని పూర్తిగా నిజమూ కాదు.



వారాఊహకు రావడానికి వారు చదివిన కొందరు మంచి రచయితల రచనలు జీవితమంత సహజంగానూ కనిపించడం ఒక కారణం. వారెరిగిన స్థానిక రచయితలు వారికికూడా తెలిసిన సంఘటనల్నే లేదా వ్యక్తుల గురించే ఏదోవిధంగా కథలుగా రాసేయడం యింకోకారణం.

కానీ గొప్ప రచయితలెవ్వరూ జరిగిన సంఘటనలు తీసుకొని, ఎరిగిన వ్యక్తుల్ని పట్టుకొని కథలల్లరు. కథలో సన్నివేశాలకూ పాత్రలకూ రూపకల్పన చేసేటప్పుడు చూసిన సంఘటనల్నీ, ఎరిగిన వ్యక్తుల్నీ నమూనాలుగానో, ముడి సరుకుగానో ఉపయోగించుకో వచ్చుగాక! యథాతథంగా తీసుకొనిమాత్రం కథలు రాయరు.

కళలకు సంబంధించి కావచ్చు, శాస్త్రాలకో, వ్యక్తిగత విజయాలకో సంబంధించి కావచ్చు - ఇలా ఏదో ఒక లక్ష్యం ఉన్న ప్రతివారికీ ఈ భౌతిక ప్రపంచాన్నీ ఇక్కడ జీవితాన్నీ అర్థం చేసుకోవలసిన అగత్యం ఉంటుంది. ప్రయత్న పూర్వకంగానూ అప్రయత్నంగానూ కూడా తమ

చుట్టూ వుండే మనుష్యులూ పశుపక్ష్యాదులతోసహా ఆ చుట్టూ వుండే పరిసరాలనూ అక్కడ జరిగే సమస్త జీవవ్యాపారాన్నీ గమనించడం అలవాటవుతుంది.

జీవితాన్ని అర్థం చేసుకోవాలనీ అర్థమైనదాన్నీ, అనుభూతులనూ ఇతరులతో పంచుకోవాలనీ కలం పట్టిన రచయితలు తక్కిన వారిమీద మరింత సునిశితంగాన్నూ సరికొత్త లోతుగానూ, వీలైనంత విస్తృతంగానూ ఆరకం పరిశీలనకు అలవాటు పడతారు.

ఆ పరిశీలనలో, వారి హృదయాన్ని గాఢంగా తాకిన సన్నివేశాలూ, సంఘటనలూతోపాటు స్పృశించి జారిపోయినవీ, జీవితంలో దగ్గరగానూ దూరంగానూ తారసిల్లిన విశిష్ట వ్యక్తిత్వాలతోపాటు అంతగా పట్టించుకోనక్కరలేనివీ, వారి వారి జీవిత గాథలూ, ప్రవర్తనలూ ప్రత్యేకతలూ, ఏ చరిత్రలూ ప్రత్యేకతలూ లేని జనాలూ, జనారణ్యాలూ, నిర్జనారణ్యాలతో ప్రకృతీ, ప్రకృతీ మానవ లోకం భయంకరంగానూ, భీభత్సంగానూ మారినప్పటి దృశ్యాలూ, అవి ప్రశాంతంగానూ, ఆహ్లాదకరంగానూ దర్శనమిచ్చేటప్పటి వాటి సౌందర్యం, ప్రకృతిలోనూ, జీవితంలోనూ, మానవ సమాజాలలోనూ వచ్చిన, వస్తూ వున్న మార్పులూ - ఇలా ఎన్నింటివో ముద్రలు వాళ్ళ జ్ఞాపకాలలోకి చేరుకొని పేరుకొని ఉంటాయి.

ఎక్కడో ఏదో సన్నివేశం లేదా ఒక సంఘటన ఒక వ్యక్తి లేదా ఒక వ్యక్తిత్వం ఒక కాంక్ష లేదా ఒక ఆంక్ష - (ఇలాంటి దేదో ఒకటి) రచయితని ఆవేశ పరచినప్పుడు అతడు చప్పున సావధానుడవుతాడు.

అసావధాన స్థితిలో అతనిని ఆవేశపరచిన అంశం కేంద్రంగా అతని తలపోత ఆరంభమవుతుంది.

అప్పుడా అంశానికి సంబంధించి అతనిలో పేరుకొని ఉన్న జ్ఞాపకాలు, సమాచారాలు ఒకటొకటే కదిలి, అంశాన్ని సాంగోపాంగంగా ఆవరించి, దానిని సాకల్యంగా పరిశీలించేందుకు ఉపయోగపడతాయి.

అలా తలపోత కొచ్చిన విషయం నుండి మనిషి నైజానికో, సామాజిక జీవితానికో, సృష్టిస్వభావానికో, ప్రకృతి నిర్మితాలూ, మానవ నిర్మితాలూ అయిన వ్యవస్థలకో - ఇలా దేనికో ఒకదానికి సంబంధించిన ఒక నూతన సత్యం లేదా వాస్తవం రచయితకు వ్యక్తమయితే ఆ తలపోత సఫలమై తత్ఫలితంగా ఒక రచనకు తొలిరూపు ఏర్పడుతుంది. కాకపోతే ఆతలపోత అందుకు సంబంధించిన సమస్తం ఘనీభవించి మళ్ళా జ్ఞాపకాల్లోకి చేరిపోవడమో లేదా వాని నుండి జారిపోవడమో జరుగుతుంది.

తలపోతను సఫలం చేయగలిగిన వాస్తవం ఇంతకు ముందు ఇతరులెవ్వరూ చెప్పని నూతన వాస్తవమే కానక్కరలేదు. రచయితకు కొత్తదైతే చాలు - దానినతడు నూతన వాస్తవంగానే గ్రహిస్తాడు.

ఆవాస్తవాన్ని గుర్తించి గ్రహించడానికి రచయితలు చేసే తలపోత కొందరిలో కొన్ని గంటలనుండి కొన్ని రోజుల్లో నెలలూ, సంవత్సరాల వరకూ సాగవచ్చు. మరికొంతమంది తలపోతకు కొద్ది నిమిషాలే సరిపోవచ్చు.


జీవితంనుండేకాక ఇతరుల రచనల నుండి కూడా ఒకప్పుడు పైరకం ప్రేరణ పొందవచ్చు. రాసినవారు తమకన్న పెద్దలో, సమిలో లేదా చిన్నలైనా కావచ్చు. వారు ఎవరైనా - వారిది ఒక పాత్రో దాని ప్రవర్తనో, ఒక సంఘటనను వారు నిర్వహించిన తీరో లేక నిర్వహింపలేక పోయినతీరో లేదా రచయిత చేసిన ఒక (సు)భాషితమో - ఇలా ఆ రచననుండి ఏదో ఒక అంశం దానిని చదివిన రచయితకు ప్రేరణ కావచ్చు.

ప్రేరణ సహజమైనా కృత్రిమమైనా ఒక వాస్తవం ఏర్పడితే అది ఒక రచనకు దారి తీస్తుంది. రచయిత నేర్చిన మేరకు అది కథో, కవితో, నవలో నాటకమో అవుతుంది.

అదీకదే అయితే ప్రేరకమైన అంశం ఆ కథకు బీజం. జ్ఞాపకాలలో నిక్షిప్తమై, అది కలిగించిన సంవేదనవల్ల ప్రేరితమైన తత్సంబంధిత అంశాలు దానికి ఆకృతి ఇవ్వబోయే ప్రమేయాలు. ఈ అతర్ప్రహార్ప్రమేయాల సంయోగాన్ని నిర్వహించి పర్యవసాయిగా ఒకవాస్తవం ఆ విష్కరణకు కారణభూతమైన వేదన దాని చైతన్యం. పర్యవసాయియైన వాస్తవం దాని అంతఃచేతన/వ్యక్తిత్వం.


అలా సర్వాంగీణమైన సజీవమైన కథ అంతరంగంలో పొడసూపగానే రచయిత ఒక అపూర్వమైన ఉద్వేగానికి గురి అవుతాడు. సృజనకు సంబంధించిన అతని శక్తులు మరింత వ్యగ్రమవుతాయి.

ఆదిన ఆవేశపరచిన ప్రమేయం నుంచిగాని - వాస్తవాన్ని గుర్తించడంలో



ఉపయోగపడిన సంఘటనలూ, అందలి వ్యక్తులనుండిగాని కొన్ని పాత్రలతో కూడిన ఒక చిన్న సంఘటన కథయొక్క తొలిరూపం కనిపిస్తుంది. కథకు కారణభూతమైన ఆవేదననూ, దాని పర్యవసాయియైన వాస్తవాన్నీ సొంతంగానూ, సాకల్యంగానూ ఆవిష్కరించగల స్థితికి కథ వృద్ధిపొందాలి.

జాగృతమైన సృజనశక్తుల ప్రభావం వల్ల తన జ్ఞాపకాలలో పదిలపడి ఉన్న వ్యక్తులూ, సంఘటనలూ సన్నివేశాల నుండి కథ అవసరానికి అనువైన పాత్రలూ, సంఘటనలూ బయటపడి కథను చేరి పరిపుష్టం చేస్తుంటే సాక్షిభూతుడుగా ఉండే రచయితలో యాదర్శ ఆనందోత్సాహాలను కలిగిస్తుంది. చేరిన రసపద్ఘట్టాలనుండి పుట్టగల రసానుభూతుల తొలి స్పర్శలు అతనిని మరింత ఉద్వేగిని చేస్తాయి. రచయిత యొక్క సృజనశక్తుల పరిమితులకు లోబడి ఆ కథా పరిణామం బలంగానో, దుర్బలంగానో, నిర్దుష్టంగానో, కొన్ని లోపాలతోనో తొందరగానో ఆలస్యంగానో ఒక



ముగింపుకి వస్తుంది.

ఆ తరవాత మాత్రమే కథతో రచయిత ప్రత్యక్ష ప్రమేయం ఆరంభ మవుతుంది!

ఆ ప్రమేయం ముందుగా కథాబలాన్నీ సామర్థ్యాన్నీ ప్రశ్నించుకోడంతో మొదలవుతుంది. లోపాలున్నట్టు కనిపిస్తే పాత్రల్లోనూ, సంఘటనల్లోనూ అవసరమైన మార్పులూ, చేర్పులూ, తొలగింతలూ చేసి రచయితే దానిని చక్కబరచుకొంటాడు. కొత్తవారూ, ఆత్మవిశ్వాసం చాలనివారూ యితరుల సహాయం తీసుకోవచ్చు.

రచయిత తన మనో ప్రపంచంలో ఆ విధంగా స్థిరపడ్డ కథకు ఆ తరవాత అక్షరరూపం ఇవ్వడానికి కూర్చుంటాడు.

ఎన్నుకొన్న పాత్రలకు స్వభావానుగుణ్యమైన రూపురేఖలూ, నామకరణాలూ ఏర్పడగా నిర్ణీత స్థలకాలాల్లో సర్వాపైన సన్నివేశాలలో, సంఘటనల్లో ప్రవేశిస్తూ ఆ పాత్రలు ఈ దశలో జీవచర్యలు ఆరంభిస్తాయి. అవి చేసే చేష్టలనూ, చర్యలనూ, పరస్పరం ఘర్షించే తీరునీ, అప్పటి వాటి సంభాషణల్నీ, ఆవేశాల - పరిణామాలనీ - గమనిస్తూనే నేరొకవంక, సహజమైనదే కాక నిర్దిష్టమైన ఒక ముగింపుకేసి వాటి కదలికలను పర్యవేక్షిస్తుంటాడు రచయిత. అదే సమయంలో మొత్తం కథను అక్షర సంకేతాలుగా రాసుకుంటాడు.

అంతవరకూ ద్రవస్థితిలో ఉన్నకథ ఆ విధంగా ఘనీభవిస్తుంది.

శిల్పి శిలనుండి శిల్పం కానిదంతా తొలగించినట్టు ఆ ఘనాకృతినుండి కథ కానిదంతా విడిచి పెట్టి సాకల్యమూ, సర్వాంగీణమైన కథను మాత్రమే చూస్తూ రచయిత, అందలి దృశ్యాలనూ, శబ్దాలనూ, అవి కలిగించగల అనుభూతులనూ తానెరిగిన భాషలో పలుకులుగా అనువదించి, ఆ అనువదితాలను అక్షర సంకేతాలుగా శుద్ధప్రతిలో ఉంచుతాడు.

కథ పుట్టి యీ విధంగా నాలుగు దశలలో అక్షర రూపానికి మారుతుంది.

రచయిత మనోలోకంలో అప్పుడప్పుడే ప్రాణం పోసుకొని అతనిని ఉద్వేగపరచిన అంకురమాత్ర రూపం కథ యొక్క తొలిదశ.

ఉద్వేగితాలైన అతని సృజన శక్తులనూ, అతని జ్ఞాపక భాండాగారంలోని జీవిత సామగ్రినీ వినియోగించుకొని సాకారతకూ, సాకల్యతకూ అభివృద్ధి చెందినది కథయొక్క రెండవదశ.

ఆకారం చెందిన కథ అక్షరరూపంలో ఘనీభవించగా ఏర్పడ్డ మూర్తి కథయొక్క మూడవదశ.

అందుండి పాఠకులకోసం సిద్ధంచేసిన శుద్ధప్రతిలో కథ దాని నాల్గవదశ.

పాఠకులు తమ అవగాహన మేరకూ శక్తి మేరకు పునర్నిర్మించుకున్నప్పటి పరిస్థితి గురించి లోగడే చెప్పుకున్నాం.

ఈ ఐదు దశలలో అసలు కథ ఏది?

అంటే పరిశీలకులు ఏ దశలో కథను ప్రధానమైన దానిగా తీసుకోవాలి ?

నాకు బాగా గుర్తులేదు.

చదువుకునేరోజుల్లో 'అహం' (గర్వం వంటిది కాదు, నేను. శ్రీశ్రీగారి 'ఐ') గురించి పాఠాలు చెపుతూ (లేదా ఆత్మ) మా మాస్టారు దానిని దాదాపు ఇలా వివరించారు.

నేను అన్నది నే వేసుకున్న యీ ఖద్దరు చొక్కా, ఖాదీ పంచె, కాళ్ళ చెప్పులూనా ? మీ ఇంగ్లీషు మాస్టార్లా నేనూ సూటూ, బూటూ తొడిగి వచ్చాననుకోండి. నేను కాకుండా పోతానా ? తెలుగులోకాక ఇంగ్లీషులో మాట్లాడినా నేను నేనే.

అంటే - నా వేషభాషలు నేనుకాదు.

అలానే యీ చామనచాయ తోలూ, నల్లజుత్తూ, మొహం కోలన, శరీరం పలచనా నేను కాదు. బొల్లిరోగం వచ్చి చర్మం రంగూ, పైత్యం ప్రకోపించి జుత్తు రంగూ మారిపోవచ్చు. తత్వం ఫిరాయించి ఊరపందిలా బలిసిపోతే అర్నెల్లయ్యేసరికి నన్నుకన్న నాతల్లేనన్ను పోల్చుకోలేక పోవచ్చు. మారింది నా రూపు కాని నేను కాను.

అంటే నా రూపం, నా చుహరా నేను కాదు.

మరి యీ ఎముకలూ, మాంసాలతో కూడుకున్న - కాళ్లూ, చేతులూ, కన్నూ, ముక్కూ అంగాలుగా కలిగిన ఈ శరీరమా నేను ? ప్రమాదానికి గురి అయ్యో, శస్త్రచికిత్స అవసరమయ్యో,



అంగాలలో కొన్నిగాని, అన్నీగాని తొలగిపోయినా నేను నేనే. ఈ రక్తం తోడేసి (ఈ వాక్యం ఒక్కటీ మా గురువుగారిది కాదు) ఇంకొకరి రక్తం నా శరీరంలో ప్రవహింప జేసినా నా శరీరంలో కండరాలూ, గుండెకాయా, కిడ్నీలు ఇతరుల వాటితో మార్చినా, ఎముకల స్థానంలో స్టీలు నమూనాలు అమర్చినా నేను నేనే.

కాబట్టి నా శరీరాంగాలు నేనుకాదు.

నేనీ రాత్రికి రాత్రే మీకళ్ళకు కనబడకుండా పోయాననుకోండి. అదే - నాశరీరం - పంచత్వం - పంచభూతాలలో కలిసిందనుకోండి. రేపు నాగురించి నా మంచి-చెడ్డల గురించి మాట్లాడరా ? నేను మీపైనెరిపిన, నెరపుతున్న దుష్ప్రభావమో, సత్ప్రభావమో కొనసాగదా ? మీరు చెప్పుకునేది యీనా శరీరం గురించా ? ఈ శరీర ధారినైన నాగురించా ? ప్రభావంనెరపేది ఈశరీరమా ? శరీరధారా ?

కాబట్టి ఈశరీరం కూడా నేను కాదు.

ఇది నేను యొక్క నాశరీరం. ఇవి నేను యొక్క నా శరీరాంగాలు. ఇది నా రూపు. ఇది నా వేషం. ఇది నా భాష, ఇందులో ఏ ఒక్కటీ గాని అన్నీ గాని,



కానటువంటి - వీటన్నింటినీ కలిగున్నటువంటి - ఆనేను - అదీ అహం!

—అంటూ అహం అనో, అత్మ అనో దాని గురించి ఇంకా ఏవో చాలా చాలా చెప్పేరు.

దాని గురించి కాదుగాని, అసలు కథ ఏదీ అన్న వెతుకులాటలో పైపద్ధతి ననుసరించి అదికాని దేదో తేల్చుకుంటే అదేదో తెలియ వస్తు అనిపించి పైదంతా చెప్పేను.

లోగడే చెప్పుకున్నాం - పాఠకుడు పునర్నిర్మించుకున్న కథ అసలు కథ కాలేదు. నాల్గవ దశలో రచయిత అందించిన కథకు అదిప్రతిబింబం. ప్రతిబింబం మాత్రమే.

నాల్గవ దశలో కథ మూడవ దశ కథకు మెరుగు పెట్టగా ఏర్పడ్డది. అది మెరుగైన రూపాంతరం.

మూడవ దశలో కథైనా రెండవ దశలో కథను వాక్యాలుగా పదబంధాలుగా అనువదించి భాషా వాహనం ద్వారా పాఠకునికి అందించే ప్రయత్నంగా తయారైనది. ఉక్తి వైచిత్రి, దేశనుడికారం, శబ్దమాధుర్యం మంటి అలంకారాలూ తొడుగులతో దర్శన మిచ్చేది. వాటిని పరిహరించి చూడవచ్చు. అయినా అది అనువదిత రూపం. మూలం ఉండగా అనువదితం అసలు కాలేదు.

అలా అయితే రెండవ దశలో కథ అసలు కథ కావాలి.

కాని అదైనా తొలిదశలో అంకుర రూపంలో కనిపించిన కథ సవివరంగా పెరిగి ధరించిన స్థూలరూపం. పైగా ఐదవదశలో కథ పాఠకుని పరిమితులకు లోబడి రూపుదాల్చినట్లు, రెండవ దశలో కథ పాఠకుని సృజన శక్తులూ, జీవితానుభవాలపై ఆధారపడి రూపొందుతుంది.

అందుచేత తొలిదశలో అంకురరూపంలో రచయితకు కనిపించిన కథే అసలు కథ అవుతుంది.

అది సూత్రం తదితరమైన దేనితోనూ సంబంధంలేని ఎవరికీ చెందని విడిగా అస్తిత్వం కల ప్రమేయమా?

రచయితని అపేక్షించని కథ అంకురరూపంలోనైనా ఉండలేదు. కాని తక్కిన దశలలో కథతో పోలిస్తే వానిలో రచయిత ప్రమేయం ఉన్నంతగా దీనిలో ఉండదు.

రచయితకు ప్రేరణ నిచ్చే అంశం బాహ్యప్రపంచం నుండి వస్తుంది. ప్రేరణవల్ల సంచలితమయ్యే ప్రమేయం కూడా బాహ్యప్రపంచానికి చెంది రచయిత అంతరంగంలో పదిల పడిన జ్ఞానం. ఈ రెండిటి సంయోగాన్ని నిర్వహించిన వేదనా, అందుండి ఏర్పడే వాత్సల్యం కూడా అతనికే పరిమితమైనవి కావు. కావు కాబట్టే వానిని పంచుకోడానికి కథ పుట్టడం, తద్వారా పంచుకోగలగడం.



కథాసృష్టిలో తొలిదశ/ కథగురించీ, దాని విశిష్టతగురించీ, ఆయాదశల్లో దాని పరిణామం గురించీ తెలియవలసినంత తెలియకపోవడంవల్లే లేదా వాటిపట్ల ఉంచవలసినంత శ్రద్ధ ఉంచకపోవడంవల్లే మంచి కథలు సగంలో ఆగిపోవడం, రాయగలవారినుండికూడా మంచి కథలు రాకుండా పోవడం, కథల అభాసలు కథలై మంచి కథలు కథలు కాకుండా పోవడం వంటి నష్టాలు చూస్తాము.



జీవమున్న ప్రతి కథలోనూ జీవసహజమైన పెనుగులాట ఏదో ఒకస్థాయిలో ఉంటుంది. ఆ పెనకువ దేని గురించి? ఎవరెవరిమధ్య లేదా ఏ ఏ శక్తులమధ్య? ఒకే వ్యక్తిలో అయితే ఏ ఆశయాలు, ఏ కోరికలమధ్య? ఏ స్వభావాలు, ఏ ఆదర్శాలమధ్య? రెండూ కోరికలే అయితే ఏ ఏ కోరికలమధ్య ఏ లక్ష్యం కోసం? ఇలా ఓ కథ పుట్టుకకూ, దాని పెంపునకూ, పర్యవసానంగా ముగింపుకీ కారణాలయ్యే వైరుధ్యాలు అంకురరూపంలో కథ ఏర్పడినప్పుడే అందులో ఇమిడి ఉంటాయి. ఆ దశలోనే ఆయావైరుధ్యాలను గుర్తించవచ్చని ఎరిగితే, కనీసం రెండోదశలోనైనా గుర్తించ గలిగితే, కథస్పష్టంగా, నిర్దుష్టంగా తయారవడంలో రచయితవల్ల పొరపాట్లు జరగవు.

మంచి కథలు రాసేవారందరూ ఈ విషయాలను తెలిసుంటారు. విశ్లేషణవల్ల కాకపోయిన సద్యస్స్ఫురణ లేదా ఇంట్యూషన్ వల్ల వారా ఎరుకను కలిగుంటారు.

ఈ విధంగా సర్వ జీవరాసుల పుట్టుకా ఏ క్రమంలో సాగుతుందో అదేక్రమంలో ఒక కథకూడా పుట్టినప్పుడు, ఆ సజీవ కథనే సృజనాత్మక కథ అనవచ్చనీ, అంటారనీ నేననుకుంటాను. *

